సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024



నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం

ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి ఎ.మల్లికార్జున తెలిపారు. IIలో



15 నుంచి చేపల వేట బంద్

సముద్ర జలాల్లో మొత్తం 61 రోజుల పాటు చేపల వేట నిషేధిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. IIలో



బై.. బై.. వైజాగ్

ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్లు విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. IIలో

న్యూస్‌రీల్

సుబ్బారెడ్డి, బాబూరావుకు అభినందనల వెల్లువ



ఢిల్లీలో సుబ్బారెడ్డిని అభినందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్, వైఎస్సార్ సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: రాజ్యసభ సభ్యులుగా గురువారం ఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులకు అభినందనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావును పెద్దల సభకు పంపించి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి విశ్వసనీయత, విధేయతకు పెద్దపీట వేశారని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంవీవీ సత్యనారాయణ, ముత్తంశెట్టి శ్రీనివాస్, గుడివాడ అమర్‌నాథ్, కె.కె రాజు, వాసుపల్లి గణేష్‌కుమార్, ఆడారి ఆనంద్‌కుమార్ ఫోన్‌లో అభినందనలు తెలిపారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివ గణేష్, పలువురు నేతలు ఢిల్లీ వెళ్లి సుబ్బారెడ్డిని అభినందించారు. ప్రమాణ స్వీకారం అనంతరం విశాఖకు చేరుకున్న గొల్ల బాబూరావును వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు పతివాడ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ఎయిర్‌పోర్టులో కలిసి అభినందనలు తెలిపారు.

డీసీపీ-1 మణికంఠ బదిలీ



విశాఖ సిటీ: విశాఖ డీసీపీ-1 వి.ఎన్.మణికంఠ చందోలు బదిలీ అయ్యారు. చిత్తూరు జిల్లా ఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మణికంఠ ఈ ఏడాది జనవరి 31వ తేదీన డీసీపీ-1గా బాధ్యతలు చేపట్టారు. కేవలం మూడు నెలల మాత్రమే విశాఖలో విధులు నిర్వర్తించినప్పటికీ.. పలు కీలక కేసుల పరిష్కారంలో ప్రముఖ పాత్ర పోషించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ స్థానం ఖాళీ అవడంతో ఎన్నికల సంఘం మణికంఠను అక్కడ నియమించింది.

కేజీహెచ్‌లో చిన్నపిల్లల వార్డు పునఃప్రారంభం



వార్డును ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: కేజీహెచ్‌లో ఆధునికీకరణ పనులు పూర్తయిన చిన్నపిల్లల ఐసీయూ(పీఐసీయూ) వార్డును కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున గురువారం పునఃప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రూ.80 లక్షల నిధులతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అలాగే కార్డియాలజీ (సీటీవీఎస్) విభాగంలో రూ.25 లక్షల నిధులతో గుండె శస్త్రచికిత్స ఐసీయూ, వార్డుల ఆధునికీకరణ, రూ.15 లక్షలతో గైనిక్, ఫ్యామిలీ ప్లానింగ్ విభాగ అనుసంధాన వారధి (ర్యాంప్) పనులు పూర్తయిన సందర్భంలో జిల్లా కలెక్టర్ ఆయా విభాగాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, చిన్నపిల్లల వార్డు విభాగాధిపతులు డాక్టర్ చక్రవర్తి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలకు ప్రత్యేక సెల్

డాబాగార్డెన్స్: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యల పరిష్కారానికి టీఎస్సార్ కాంప్లెక్స్ నీటి సరఫరా విభాగంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో కలిగే అంతరాయాలు, ఇబ్బందులు, పైప్ లైన్ల లీకులు, బోర్‌వెల్స్ మరమ్మతులకు సంబంధించి ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు 9154109610 నంబరుకు, 24 గంటలూ 0891-2746672కు ఫోన్ చేసి తెలపవచ్చని తెలిపారు.

3,275 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా గురువారం సప్తగిరినగర్ (పి శాపురం కాలనీ), స్వతంత్రనగర్ (మిథిలాపురి వుడా కాలనీ), విద్యానగర్(కాగితాలవారి వీధి), ఎంవీపీ కాలనీ (లాసన్స్‌బే కాలనీ), జాలరిపేట (రంగీరాజువీధి), ఏకేసీ కాలనీ, వుడా కాలనీ (అంబేడ్కర్‌నగర్), నాతయ్యపాలెం (అక్కిరెడ్డిపాలెం), ఎల్‌వీ నగర్ (పెదగంట్యాడ), పాపయ్యరాజుపాలెం (పురుషోత్తపురం)లో వైద్య శిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో 3,275 మందికి వైద్య సేవలందించారు. 11 మందిని వివిధ కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

● ఈ పాపం బాబుదే..



మధురానగర్ సచివాలయంలో పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

ఇలా అయితే.. మా బతుకులు ఏమవుతాయో?



ఈ ఫొటోలో కనిపిస్తున్న 85 ఏళ్ల అవ్వ ఊడికల రామయ్యమ్మది అక్కయ్యపాలెం. ఈమెకు నలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు. భర్త లేడు. పిల్లలు ఎవరి బతుకులు వారు బతుకుతున్నారు. ఒంటరిగా ఉంటున్న ఈమెకు ప్రభుత్వం ఇచ్చే రూ.3 వేల పెన్షన్ సొమ్మును వార్డు వలంటీరు నెలనెలా ఇంటికే తెచ్చి ఇస్తోంది. ఈనెల పెన్షన్ ఇంటికి తెచ్చి ఇవ్వరని, సచివాలయానికే వెళ్లి తీసుకోవాలని తెలియడంతో ఆమె షాకైంది. ఒంట్లో ఓపిక లేకున్నా పడుతూ లేస్తూ ఎండలో సచివాలయానికి వచ్చి రూ.3 వేలు తీసుకుంది. 'ఈ ఐదేళ్లలో ఎప్పుడూ ఇలాంటి **పరిస్థితి లేదు. చెంద్రబాబు వల్లే ఇదంతా జరిగిందని నాలాటి ముసలోల్లు అనుకుంటన్నారు. ముదపాకలో నాకు జగన్ ఇంటి జాగా ఇచ్చేరు. ఇల్లు కూడా ఇత్తామన్నారు. గవర్మెంటు మారితే మా బతుకులేమ**వుతాయోనని బయంగా ఉంది. జగన్‌బాబు మళ్లీ సీఎం అయితేనే మాలాటి పేదోల్లు బతుకుతారు. పెతీ నెలా పించిన్లు ఇంటికే తెచ్చిత్తారు. అంతుకే జగనే మళ్లీ అధికారంలోకి రావాల.' అంటూ అడుగులో అడుగులేస్తూ ఇంటికి పయనమైంది. ఒక్క రామయ్యమ్మే కాదు.. ఇలాంటి వారెందరో ఆసరానిచ్చే జగన్ కోసమే పరితపిస్తున్నారు.



ఆరిలోవలో గుత్తుల లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ సురేష్

- మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి
- ఆయన కొనసాగితేనే మా పెన్షన్లకు భరోసా
- సంక్షేమంతో పేద బతుకులు కులాసా
- చంద్రబాబు వస్తే మాలాంటోళ్లకు అధోగతే..
- నోటికాడ కూడు తీసేస్తాడంటూ ఆందోళన
- పెన్షన్ కోసం అవస్థలు పడుతున్నామంటున్న పింఛనుదారులు





సింహాచలంలోని సచివాలయం వద్ద, 13వ వార్డు ఆరిలోవ సచివాలయం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం : ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలు, పింఛన్లు పుణ్యమాని ఐదేళ్లు నోట్లోకి వెళ్తున్నాయన్న ధీమా అందరిలోనూ ఉంది. అయితే ఇటీవల జరుగుతున్న పరిణామాలు వీరి ఆందోళనకు కారణమవుతోంది. గ్రామ/వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి పెన్షన్లతో పాటు పలు సంక్షేమ పథకాలను వారి ద్వారా ప్రజలకు నేరుగా అందేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు. ఈ వ్యవస్థతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోంది. అలాంటి విజయవంతమైన వలంటీర్ల వ్యవస్థను లేకుండా చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుయుక్తులను వీరు కళ్లారా చూస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో చంద్రబాబు బ్యాచ్ వలంటీర్లను ప్రజలకు దూరం చేసే ఎత్తుగడ వేసింది. దీంతో ఎన్నికలయ్యే దాకా వారిని దూరం పెట్టాలంటూ ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రతి నెలా ఒకటో తేదీనే అవ్వా తాతల ఇళ్లకెళ్లి వారి చేతిలోనే పెన్షను సొమ్మును అందజేసే వీలు లేకుండా పోయింది. అంతేకాదు.. ఎక్కడో దూరంగా ఉన్న గ్రామ/వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛన్ డబ్బు తీసుకునే పరిస్థితి వచ్చింది. అదీ మండుటెండల్లో పండుటాకులు వెళ్లి రావడానికి ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇన్నాళ్లూ ఇంటికే పెన్షను తీసుకొచ్చి ఇచ్చే వారికి అడ్డుపడి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ చంద్రబాబుపై వీరు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. 2019కి ముందు ఆయన హయాంలో ఇలాంటి పరిస్థితే ఉండేదని వీరంతా గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థనే కాదు.. సంక్షేమ పథకాలతో పాటు పింఛన్లకూ గండి కొడతారని, నోటి కాడ కూడు తీసేస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ రోగులు తదితరులు కలవర పడుతున్నారు.

వేగం పుంజుకున్న పింఛన్ల పంపిణీ

పింఛన్ల పంపిణీ మరింత వేగం పుంజుకుంది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచే సచివాలయాల్లో సిబ్బంది పెన్షన్ల పంపిణీ చేపట్టి రాత్రి ఏడు గంటల వరకు కొనసాగించారు. పింఛనుదార్లు వేచి ఉండకుండా సత్వరమే సొమ్ము అందజేశారు. వీరికి ఎండ దెబ్బ తగలకుండా టెంట్లు, కుర్చీలు, మంచినీటి సదుపాయం కల్పించారు. విశాఖ జిల్లాలో 1,65,432 పెన్షన్లకు గాను 1,53,323 (92.68 శాతం) మందికి పంపిణీ చేశారు. 2,66,208 పింఛనుదార్లున్న అనకాపల్లి జిల్లాలో 2,26,422 (85.05 శాతం) మందికి అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,27,894 మంది పింఛన్లకు గాను 91,938 (71.89 శాతం) మందికి పంపిణీ జరిగింది.

ఇది దుర్మార్గం చంద్రబాబూ..



నా వయసు 80 ఏళ్లు. ఇన్ని రోజులు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు వలంటీర్ రాలేదు. పింఛనూ రాలేదు. ఎందుకని వాకబు చేస్తే చంద్రబాబు వాళ్లను ఆపించేశారని తెలిసింది. వలంటీర్ రాకపోతే ఈ వయసులో సచివాలయానికి ఎలా వెళ్లి పింఛన్ తెచ్చుకోగలను. రెండు వారాల కిందట సచివాలయానికి ఓ సర్టిఫికెట్ కోసం వెళ్లి.. అక్కడే కళ్లు తిరిగి పడిపోయాను. దెబ్బలు కూడా తగిలాయి. ఇప్పుడు సచివాలయానికి వెళ్లాలంటే భయం వేస్తోంది. వలంటీర్లను ఆపించడం దుర్మార్గం చంద్రబాబూ..

– కొప్పిశెట్టి శేషు, చినగంట్యాడ

కూలిపని పోయింది



ప్రతి నెలా ఒకటో తేదీన వార్డు వలంటీర్ ఫించన్ సొమ్మును ఎంతో బాధ్యతగా ఇంటికి తీసుకొచ్చి అందజేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. దీంతో ఓ రోజు కూలి పోయింది. సవ్యంగా జరిగే పింఛన్ పంపిణీ వ్యవస్థకు చంద్రబాబు కుట్ర రాజకీయాల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. ఐదేళ్లు సంతోషంగా ఉన్నామంటే.. అది సీఎం జగన్ చలువే..

– లింగమ్మ, పీఎంపాలెం

మాపై కక్ష కట్టారు



మాపై చంద్రబాబు కక్ష కట్టారు. మేం పింఛన్ తీసుకోవడం ఆయనకు ఇష్టం లేదేమో. వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేయకుండా కక్షపూరితంగా వ్యవహరించారు. గత టీడీపీ పాలన, జన్మభూమి కమిటీల గురించి ఆలోచిస్తే భయమేస్తోంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రతి నెలా వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్లు ఇచ్చారు. ఇంత చక్కని పాలన ఇంకెవ్వరూ అందించలేరు.

– బొండా అచ్చిలనాయుడు, కలపాక

మమ్మల్ని ఇబ్బంది పెట్టడం న్యాయమేనా.?



కాళ్లు చేతులు సరిగా లేని వికలాంగురాలిని.. పైగా ఒంటరి మహిళను. ఒకటో తేదీ నుంచి వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తారని ఎదురు చూస్తున్నాను. వీధిలో అడిగితే వలంటీర్ రాడని, సచివాలయానికి వెళ్లాలని చెప్పారు. పింఛన్ అర్జంట్‌గా కావాలంటే సచివాలయానికి వచ్చి తీసుకోమంటున్నారు. డబ్బులు అవసరం ఉన్నా.. వెళ్లలేని పరిస్థితిలో ఉన్నాను. సాయం చేసే మనిషి కూడా లేరు. ప్రతి నెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. మా లాంటి వాళ్లని ఇబ్బంది పెట్టడం న్యాయమేనా.?

– బి.సత్యవతి, వేంకటేశ్వర కాలనీ, 43వ వార్డు

బాబూ.. నీ వల్లే ఈ దుస్థితి



పింఛన్ తీసుకోవడానికి సచివాలయం వద్దకు వచ్చాను. మెట్లు దిగినప్పుడు జారి పడి తలకు తీవ్ర గాయమైంది. 14 కుట్లు వేశారు. చంద్రబాబు.. నీ కడుపు మంట చల్లారిందా? నీ వల్లే నాకీ దుస్థితి. నాలుగున్నరేళ్లకు పైగా వలంటీరే పింఛన్ అందజేశారు. 62 ఏళ్ల వయసులో ప్రభుత్వం ఇచ్చే పింఛనే నాకు ఆధారం. ఇంతకాలం ఇంటి వద్దే పింఛన్ తీసుకుంటున్న నేను ఈ రోజు చంద్రబాబు చేసిన కుట్రలతో చాలా ఇబ్బందులు పడ్డాను.

– ఈశ్వరమ్మ, మల్కాపురం, నగరాలవీధి

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు

సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు కనకరాజును వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఆనందపురం మండలం గొట్టిపల్లికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు దొంతల కనకరాజు తన అనుచరులతో వైఎస్సార్‌సీపీలో చేరారు. గురువారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయం వద్ద ఆయనకు పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత మంది టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరనున్నారని తెలిపారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ నుంచి చాలా మంది వచ్చేస్తున్నట్టు తప్పుడు ప్రచారం చేస్తూ అందరినీ మభ్యపెట్టడానికి యత్నిస్తున్నారన్నారు. అలా ఎవరూ పార్టీని వదిలి వెళ్లడం లేదన్నారు. ప్రజలతో గంటా మైండ్‌గేమ్ ఆడుతున్నారని, దీన్ని ఎవరూ నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆయనపై పూర్తి వ్యతిరేకత ఉందన్నారు. మరికొద్ది రోజుల్లో టీడీపీ నుంచి చాలా మంది వైఎస్సార్‌సీపీలోకి రానున్నారని తెలిపారు. ఇప్పుడు వచ్చిన ఎంపీటీసీ సభ్యుడు కనకరాజుకు ఆ ప్రాంతంలో ఎంతో గుర్తింపు ఉందని, ఆయన వల్ల వైఎస్సార్ సీపీకి బలం పెరిగిందన్నారు. పార్టీలో చేరిన ఎంపీటీసీ సభ్యుడు కనకరాజు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు కేవలం స్వార్థం చూసుకుంటారని, ప్రజలను ఏమాత్రం పట్టించుకోరన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్న ప్రజల మనిషని కొనియాడారు. తనకు వైఎస్సార్ సీపీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఎంతో అభిమానమన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును అధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. పార్టీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచిలి సూర్యనారాయణ, మజ్జి వెంకటరావు, బి.మణిశంకర్‌నాయుడు, తాడివాడ శ్రీను, దొంతల రామారావు, గంట్రెడ్డి శ్రీనివాస్, గంట జగదీష్, పిన్నింటి వెంకటరమణ పాల్గొన్నారు.

పోలింగ్ సిబ్బంది.. 13,248 మంది

- 2,321 మందిని ప్రిసైడింగ్ అధికారులుగా నియామకం
- 2,321 ఏపీవోలు, 8,606 ఓపీఓలుగా గుర్తింపు
- 1991 పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వర్తించేలా ర్యాండమైజేషన్
- 10,12 తేదీల్లో పోలింగ్ అధికారులకు శిక్షణ



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్


మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ మేరకు కలెక్టర్ డా.మల్లికార్జున గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో మోహన్‌కుమార్, ఎన్ఐసీ అధికారులతో కలిసి డిజిటల్ ప్రక్రియలో పీవో, ఏపీవో, ఓపీవోలకు ర్యాండమైజేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ క్రమంలో అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని నియోజకవర్గాల్లోని 1991 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించాల్సిన పీవో, ఏపీవో, ఓపీవో కేటగిరీలకు సంబంధించిన సుమారు 13,248 మందికి తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ పేర్కొన్న నిబంధనలను పాటిస్తూ సిబ్బందిని కేటాయించారు. వీరంతా ఈ నెల 10, 12వ తేదీల్లో జరిగే శిక్షణ సదస్సులకు వారికి కేటాయించిన ప్రాంతాల్లో హాజరుకావాల్సి ఉంటుంది. ఈ మేరకు యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసింది. సంబంధిత ఆర్డర్ కాపీలను, పోస్టల్ బ్యాలెట్ వినియోగం నిమిత్తం ఫారం-12 పత్రాలను అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ నెల 10, 12వ తేదీల్లో జరిగే శిక్షణ సదస్సులకు అందరూ విధిగా హాజరు కావాల్సిందేనని ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నియోజకవర్గాల వారీగా ప్రిసైడింగ్ అధికారులు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుష పీవో	మహిళా పీవో	మొత్తం పీవోలు	ఏపీవోలు	ఓపీవోలు
భీమిలి	359	406	171	577	292	946
విశాఖ తూర్పు	293	252	157	409	318	1187
విశాఖ దక్షిణ	237	45	33	78	92	1498
విశాఖ ఉత్తర	275	244	190	434	188	1264
విశాఖ పశ్చిమ	222	80	77	157	258	1403
గాజువాక	306	142	104	246	913	1654
పెందుర్తి	299	265	155	420	260	654
మొత్తం	1991	1434	887	2321	2321	8606

బండారు.. ఏకాకి!

- టీడీపీ కింది స్థాయి నేతల టచ్‌లోకి పంచకర్ల
- మాజీ మంత్రిని పక్కన పెట్టేసిన వైనం
- 43 ఏళ్ల సీనియర్‌కు అవమానాలు
- ఎక్కడికక్కడ బండారు వర్గాన్ని వెక్కిరిస్తున్న జనసేన క్యాడర్



పెందుర్తి: జగమంతా కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది అన్నట్లు తయారైంది 43 ఈయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ బండారు సత్యనారాయణమూర్తి పరిస్థితి. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా, టీడీపీలో రాష్ట్ర స్థాయి నేతగా గుర్తింపు పొందిన బండారు ప్రస్తుతం ఇంటి నుంచి బయటకు రాలేని దుస్థితి నెలకొంది. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థిగా పెందుర్తి బరిలో ఉన్న పంచకర్ల రమేష్‌బాబు తన చిరకాల ప్రత్యర్థి బండారు సత్యనారాయణమూర్తిని క్రియాశీల రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకునేలా చేశారు. కూటమి అభ్యర్థిగా ఉన్న రమేష్‌బాబు ప్రధాన పార్టీ టీడీపీని కలుపుకుని వెళ్లాల్సింది పోయి.. దొడ్డిదారిలో టీడీపీలో బండారు వ్యతిరేక వర్గాన్ని చేరదీస్తున్నారు. అదే సమయంలో నియోజకవర్గంలో అడుగడుగునా బండారు వర్గానికి జనసేన క్యాడర్ నుంచి తీవ్రస్థాయిలో అవమానాలు ఎదురవుతున్నాయి. 'మాకు మీ అవసరం లేదు'అంటూ బండారు వర్గాన్ని మరింత రగిలిపోయేలా చేస్తున్నారు.

అధినేత నుంచే అవమానం

జనసేన–టీడీపీ జత కట్టిన దగ్గర నుంచి సీనియర్, స్థానికుడైన బండారు సత్యనారాయణమూర్తి పెందుర్తి టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్నారు. చంద్రబాబు, లోకేష్ కూడా పలు బహిరంగ వేదికల్లో బండారుకే టికెట్ అన్నట్లు సంకేతాలిచ్చారు. తీరా ఆఖరి నిమిషంలో బండారును కాదని కొద్ది రోజుల కిందట జనసేన తీర్థం పుచ్చుకున్న స్థానికేతరుడు పంచకర్లకు పెందుర్తి టికెట్ కేటాయించారు. బండారుకు టికెట్ ఇవ్వకపోగా.. కనీసం ఆయన అభిప్రాయాన్ని కూడా చంద్రబాబు పరిగణలోకి తీసుకోలేదు. ఒకవైపు టికెట్ నిరాకరించడం.. మరోవైపు తన చిరకాల ప్రత్యర్థి అయిన రమేష్‌బాబుకు టికెట్ ఇవ్వడంతో బండారు రగిలిపోతున్నారు. నిద్రాహారాలు కూడా సరిగా లేకపోవడంతో కొద్ది రోజుల కిందట అనారోగ్యం పాలయ్యారు. అయినా కూడా టీడీపీ అధిష్టానం నుంచి కనీసం పరామర్శ లేదని బండారు వర్గం అగ్గిమీద గుగ్గిలమవుతోంది.

బండారా.. డోంట్ కేర్ : ఇదిలా ఉండగా జనసేన నుంచి కూడా బండారుకు తొలి నుంచి అవమానాలే ఎదురవుతున్నాయి. ఇరు పార్టీలు జతకట్టిన తర్వాత తప్పదన్నట్లు అప్పుడప్పుడు కలసి తిరిగినా.. బండారు–పంచకర్ల బంధం టికెట్ కేటాయించిన తర్వాత అతుక్కునే ప్రయత్నమే జరగలేదు. బెర్త్ ఖాయం చేసుకొని పెందుర్తి నియోజకవర్గంలో అడుగుపెట్టిన పంచకర్ల రమేష్‌బాబు మర్యాద కోసమైన బండారును పలకరించలేదు. ఇంటికే పరిమితమైన బండారు లేకపోతే మాకెంటి అనే రీతిలోనే జనసేన తీరు ఉంది తప్పితే.. పొత్తు ధర్మం కోసం పంచకర్ల వర్గం బండారును కలుపుకునే ప్రయత్నం చేయలేదు. కాగా.. కొద్ది రోజులుగా బండారుపై కాస్తోకూస్తో అసంతృప్తిగా ఉన్న కిందిస్థాయి నాయకులతో పంచకర్ల టచ్‌లోకి వెళ్లడంతో.. బండారు వర్గం తీవ్రస్థాయిలో రగిలిపోతోంది. నాలుగు దశాబ్దాలుగా నియోజకవర్గంలో టీడీపీని మోసిన బండారు సత్యనారాయణమూర్తికి జనసేన నుంచి ఇన్ని అవమానాలా? అంటూ టీడీపీ పాత కాపులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా న్యాయవాద సంఘ ఎన్నికలు

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 2,866 న్యాయవాదులు ఓట్లు కలిగి ఉండగా, 2,141 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల నిర్వహణకు సహకరించిన న్యాయవాదులు, సిబ్బంది, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ లా కళాశాల, గీతం న్యాయ కళాశాల, ఎంబీఎం లా కళాశాల న్యాయ విద్యార్థులకు ఎన్నికల అధికారి కేశ ప్రగడ వెంకట నరసింహమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లెక్కింపు ప్రారంభించారు. అధ్యక్ష స్థానానికి ప్రముఖ న్యాయవాది బి.సత్యనారాయణ ఆధిక్యంలో ఉన్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేస్తున్న డి.నరేష్ కుమార్ తన సమీప ప్రత్యర్థి డాక్టర్ కె.రవిశంకర్‌పై లీడ్‌లో కొనసాగుతున్నారు. ప్రధానంగా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు లెక్కింపు జరుగుతోంది. మిగతా స్థానాలకు శుక్రవారం ఓట్ల లెక్కింపు జరుగుతుందని సహాయ ఎన్నికల అధికారి ఎం.కె.శ్రీనివాస్ తెలిపారు.

అకా'డమ్మీ'



- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కోచింగ్ సెంటర్లు
- ప్రభుత్వ అనుమతుల్లేకుండానే నిర్వహణ
- ఇంటర్ విద్యార్థులే టార్గెట్‌గా దోపిడీ
- ఐఐటీ, జేఈఈ, నీట్ పేరుతో రూ.లక్షల్లో వసూలు
- కోచింగ్ సెంటర్ల లెక్క తీస్తున్న అధికారులు

నగరంలోని జీవీఎంసీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఓ సంస్థ అకాడమీ ఏర్పాటు చేసింది. ఇంటర్ బోర్డు నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండానే ఇక్కడ విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చేస్తోంది. శ్రీనగర్ బుధిల్ పార్కు సమీపంలోని ఓ కోచింగ్ సెంటర్‌కు ప్రభుత్వ పరంగా ఎటువంటి అనుమతుల్లేవు. వన్‌టౌన్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఇంటర్మీడియట్ అడ్మిషన్లు కల్పించి.. శ్రీనగర్‌లో కోచింగ్ ఇస్తోంది. ఐఐటీ, నీట్ ఎంట్రన్స్ పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తోంది.

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ విద్యార్థులే టార్గెట్‌గా విశాఖ కేంద్రంగా అకాడమీల పేరిట కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నప్పటికీ.. ఆర్భాటపు ప్రచారాలతో విద్యార్థులను నిర్వాహకులు చేర్చుకుంటున్నారు. ఐఐటీ, జేఈఈ, ఎంసెట్, నీట్, సీఏ ఎంట్రన్స్‌ల్లో ర్యాంకుల బూచి చూపించి.. సీటు గ్యారెంటీ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఏదైనా విద్యాసంస్థ ప్రారంభించాలంటే విద్యాశాఖ, ఫైర్, పోలీస్, జీవీఎంసీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. ఆయా శాఖల నుంచి లైసెన్సు పొందేందుకు నిర్దిష్టమైన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ప్రైవేట్ వ్యక్తుల అజమాయిషీలో నిర్వహిస్తున్న అకాడమీల ద్వారా అటు ప్రభుత్వానికి గానీ.. ఇటు నగర పాలక సంస్థకు కానీ ఒక్క రూపాయి కూడా ఆదాయం రావడం లేదు. ప్రభుత్వ కాలేజీల్లో పనిచేసే కొంతమంది అధ్యాపకులు సైతం ఇక్కడ గెస్ట్ ఫ్యాకల్టీగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

తల్లిదండ్రుల ఆశలతో వ్యాపారం

తమ పిల్లలు ఇంజినీరో.. డాక్టరో కావాలనే తపనపడే తల్లిదండ్రులను టార్గెట్‌గా చేసుకుని అకాడమీల నిర్వాహకులు విద్యా వ్యాపారం చేస్తున్నారు. పోటీ పరీక్షల్లో ర్యాంకుల పేరుతో ఇరుకు గదుల్లో కూర్చోబెట్టి రేయింబవళ్లు ప్రిపరేషన్ పేరిట విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఇలానే దొండపర్తి సెంటర్‌లోని వసతి గృహంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య సంఘటన తీవ్ర దుమారం రేపింది. ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న అకాడమీలు, వాటికి అనుబంధంగా ఉన్న వసతి గృహాల్లో ఏదైనా జరగరాని సంఘటనలు చోటుచేసుకున్నప్పుడు.. ఎవరిపై చర్యలు తీసుకోవాలనే దానిపై అధికారులు సైతం తర్జనభర్జన పడుతున్నారు.

అకాడమీల లెక్కతీస్తున్న అధికారులు

ఎటువంటి అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న అకాడమీ, కోచింగ్ కేంద్రాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత శాఖల అధికారులు వీటిపై ఫోకస్ పెట్టారు. కోచింగ్ కేంద్రాలకు గుర్తింపు ఇవ్వడం ద్వారానే వీటిపై నియంత్రణకు ఆస్కారం ఉంటుందని భావించిన ఉన్నతాధికారులు.. దీనిపై కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న అకాడమీ, కోచింగ్ కేంద్రాల వివరాలను సేకరిస్తున్నారు.

తప్పుడు ప్రకటనలు ఇస్తే చర్యలు



కోచింగ్ కేంద్రాలు, అకాడమీల విషయంలో ఏం చేయాలనే దానిపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరుగుతోంది. విద్యార్థులను ప్రలోభాలకు గురిచేసేలా తప్పుడు ప్రకటనలు ఇస్తే, అలాంటి వారిపై చర్యలకు సిఫార్స్ చేస్తాం. అనుమతుల్లేకుండా కాలేజీలకు అనుబంధంగా వసతి గృహాలు కూడా నిర్వహించకూడదు.

– పి.మురళీధర్, ఆర్ఐవో, విశాఖపట్నం

ఒత్తిడికి గురిచేస్తే సహించేది లేదు



కార్పొరేట్ కాలేజీలకు అనుబంధంగా నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లలో విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వాటిపై చట్టపరంగా చర్యలకు కమిషన్ సిఫార్సు చేస్తోంది. అకాడమీ, కోచింగ్ సెంటర్లకు గుర్తింపు ఇవ్వడం ద్వారానే వాటిపై నియంత్రణ సాధ్యమవుతుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తాం.

– డాక్టర్ జి. సీతారాం,
రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు

15 నుంచి చేపల వేట బంద్

- 61 రోజుల పాటు నిషేధం
- ఉత్తర్వులు జారీ చేసిన మత్స్యశాఖ



మహారాణిపేట: సముద్ర జలాల్లో ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు మొత్తం 61 రోజుల పాటు వేట నిషేధిస్తూ రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏటా వేసవిలో చేపల సంతానోత్పత్తి సీజన్ కావడంతో సముద్రంలో వేటను నిషేధిస్తున్న సంగతి తెలిసిందే. విశాఖ జిల్లాలో 65 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. 32 మత్స్యకార గ్రామాలు, 15 ఫిష్ లాండింగ్ కేంద్రాలు ఉన్నాయి. సుమారు 51 వేల మత్స్యకార కుటుంబాలు నివసిస్తున్నాయి. 10 వేల మందికిపైగా మత్స్యకారులు సముద్రంలో చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. హార్బర్‌పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికిపైగా జీవిస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా 1,674 బోట్లు, భీమిలి కేంద్రంగా 294 బోట్లపై వేట చేస్తున్నారు. ఇవి కాకుండా 443 సంప్రదాయ బోట్లు ఉన్నాయి. సంప్రదాయ బోట్లు తప్పించి.. అన్ని మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకు ఈ నిషేధ చట్టం వర్తిస్తుంది. నిషేధ కాలంలో మత్స్యవేట చేస్తే ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం సెక్షన్(4)ను అనుసరించి శిక్షార్హులు. వారి బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడంతోపాటు జరిమానా విధించే అవకాశం ఉంది. అలాగే ప్రభుత్వం అందిస్తున్న డీజిల్ ఆయిల్ రాయితీ, అన్ని రకాల సౌకర్యాలు నిలుపుదల చేస్తామని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. విజయకృష్ణ తెలిపారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో శానిటరీ వర్కర్





13వ వార్డు ఆరిలోవలో టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శానిటరీ వర్కర్ బాలస్వామి

ఆరిలోవ: టీడీపీ ఎన్నికల ప్రచారంలో ఓ ప్రభుత్వ ఉద్యోగి పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది. తూర్పు నియోజకవర్గంలో శానిటరీ వర్కర్ బాలస్వామి నిస్సిగ్గుగా టీడీపీ కండువా వేసుకొని ప్రచారం చేస్తున్నాడు. జీవీఎంసీ 12వ వార్డులో శానిటరీ వర్కర్‌గా పని చేస్తున్న తురకపూడి బాలస్వామి ఆయనకు బదులు వేరొకరిని పనిలో పెట్టుకున్నాడు. ఆయనకు వచ్చిన వేతనంలో అతని స్థానంలో పనిచేస్తున్న వారికి నెలకు కొంత మొత్తం ఇస్తుంటాడు. ప్రస్తుతం 13వ వార్డులో బాలస్వామి టీడీపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నాడు. ఇది ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. దీనిపై ప్రత్యర్థులు అధికారులకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఆయనపై తూర్పు నియోజకవర్గం ఎన్నికల విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరుతున్నారు.

నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నాం

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని, ప్రవర్తనా నియమావళి అమల్లో అప్రమత్తంగా ఉంటున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎ.మల్లికార్జున స్పష్టం చేశారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన ఘటనలో పలువురిపై చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఓటు నమోదు ప్రక్రియ, కోడ్ అమలు, ర్యాండమైజేషన్, కేసుల నమోదు తదితర అంశాలపై చర్చించారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవడంలో ఉపేక్షించేదిలేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 30 వలంటీర్లు, ఇద్దరు అవుట్ సోర్సింగ్, ఐదుగురు ఒప్పంద ఉద్యోగులపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా నమోదైన 228 ఫిర్యాదులకు గానూ 100 నిమిషాల్లో 170 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. మిగిలినవి సాధారణ ఫిర్యాదులని చెప్పారు. రూ.2.52 కోట్ల విలువైన సామగ్రి, నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 2024 ఏప్రిల్ నాలుగో తేదీ నాటికి 19,87,222 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరందరికీ ఈ నెల 29 నుంచి ఓటర్ గైడ్, వివరాలతో కూడిన ఓటరు స్లిప్పులను అందజేస్తామన్నారు. దివ్యాంగులకు హోం ఓటింగ్ విధివిధానాలపై అవగాహన కల్పిస్తూ.. వారికి ప్రత్యేకమైన గైడ్ అందజేస్తామన్నారు. ఈ నెల 14వ తేదీ వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని అర్హులైన అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

బై.. బై.. వైజాగ్



విమానాశ్రయంలోకి వెళ్తున్న కేకేఆర్ ఆటగాళ్లు

గోపాలపట్నం: ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ), కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) జట్లు విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. విశాఖ విమానాశ్రయం నుంచి గురువారం మధ్యాహ్నం కేకేఆర్ జట్టు చెన్నైకు, సాయంత్రం డీసీ జట్టు ముంబయికి ప్రత్యేక విమానంలో బయలుదేరాయి. ఆటగాళ్లకు అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంను హోం గ్రౌండ్‌గా డీసీ ఎంపిక చేసుకున్న సంగతి తెలిసిందే. సీఎస్‌కేతో జరిగిన మ్యాచ్‌లో విజయం సాధించిన డీసీ.. కేకేఆర్‌తో జరిగిన మ్యాచ్‌లో భారీ ఓటమి చవిచూసింది. అయితేనేం ఐపీఎల్ అభిమానులకు మరిచిపోలేని జ్ఞాపకాలను అందించింది. డీసీతో జరిగిన మ్యాచ్‌ను ఎంజాయ్ చేసిన కేకేఆర్ జట్టు యజమాని షారుఖ్‌ఖాన్ కూడా ప్రత్యేక విమానంలో ముంబయి వెళ్లారు.

వృద్ధురాలిపై ఇద్దరు యువకుల లైంగిక దాడి?

ఎంవీపీకాలనీ: వృద్ధురాలిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జాలరిపేటకు చెందిన ఇద్దరు అకతాయి యువకులు సుమారు 55 ఏళ్ల వయసు గల వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. మద్యం మత్తులో వారు ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం. వృద్ధురాలు దాడి ఘటనను ఎంవీపీ పోలీసుల దృష్టికి తీసుకురాగా.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరి

ఉపరవాణా కమిషనర్ రాజారత్నం

గోపాలపట్నం: జిల్లాలోని అన్ని వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం స్పష్టం చేశారు. మాధవధార రవాణాశాఖ కార్యాలయంలో గురువారం వాహన విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త వాహనాలకు హై సెక్యూరిటీ ప్లేట్లు అమర్చే బాధ్యత డీలర్లదేనన్నారు. ఈ బోర్డులు బిగించిన తర్వాతే వాహనాలు డెలివరీ ఇవ్వాలని ఆదేశించారు. ప్రత్యేక నంబర్ తీసుకున్న పక్షంలో రిజిస్ట్రేషన్ అయిన వెంటనే నంబర్ ప్లేట్ వాహనానికి ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 20 నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, హై సెక్యూరిటీ బోర్డు లేని వాహన యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత వాహనాలకు హై సెక్యూరిటీ నంబర్ బోర్డు కోసం https:// www. siam. in/ ను సందర్శించాలని సూచించారు. దీని ద్వారా వచ్చిన నంబర్‌ను వాహనానికి అమర్చాలన్నారు. బీహెచ్ సిరీస్‌లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు సంబంధించిన అర్హతలను పూర్తిగా నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సిరీస్‌లో వాహనాలను కొనుగోలు చేసే వారు వాహనానికి సంబంధించిన రుజువు పత్రాలను సరి చూసుకున్న తర్వాతే తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ సిరీస్‌లో తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ పొందినట్లయితే మోటార్ వాహన చట్టం సెక్షన్ 55 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నగరంలోని పలువురు డీలర్లు, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యువ శాస్త్రవేత్తలే భావి భారతావని మార్గదర్శకులు

ఎన్ఎస్‌టీఎల్ యంగ్ సైంటిస్ట్ మీట్‌లో అధికారులు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీవో చైర్మన్ వి.కామత్, డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు

గోపాలపట్నం : యువ శాస్త్రవేత్తల ఆలోచనలు, ప్రతిభ, ఆవిష్కరణలకు యంగ్ సైంటిస్ట్ మీట్ వేదిక అవుతుందని, వారే భావి భారతావని మార్గదర్శకులని భారత ప్రభుత్వ రక్షణ శాఖ ఆర్ అండ్ డి కార్యదర్శి, డీఆర్‌డీవో చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ అన్నారు. గురువారం నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్) మానసి ఆడిటోరియంలో యువ శాస్త్రవేత్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ శాస్త్రవేత్తల ప్రతిభను సానబెట్టేందుకు వైఎస్ఎం దోహదపడుతుందన్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో ఈ మీట్‌ను 2011లో ప్రారంభించామని తెలిపారు. ఈ సమావేశంలో యువ శాస్త్రవేత్తలు పాల్గొని వారి ఆలోచనలు, నూతన ఆవిష్కరణలను అందరితో పంచుకుంటారన్నారు. దీని వల్ల మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ సమ్మేళనంలో ఫోర్జింగ్ కనెక్షన్ టు ఇగ్నైట్ మైండ్ అనే అంశంపై మూడు రోజులు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా 2047 నాటికి అధునాతన ఆయుధాల అభివృద్ధి అనివార్యమన్నారు. డీఆర్‌డీవోను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు యువ శాస్త్రవేత్తల కృషి అవసరమన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ గొప్ప లక్ష్యాలను నెరవేర్చే బాధ్యత యువ శాస్త్రవేత్తలపై ఉందన్నారు. డైరెక్టర్ జనరల్ వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ రక్షణలో యువ శాస్త్రవేత్తలు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. వారు అంకితభావంతో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ముంబైకి చెందిన టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చి డైరెక్టర్ ప్రొఫెసర్ జయరామ్ ఎన్. చెంగలూర్ టెక్నాలజీ ఇన్నోవేషన్ అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా యంగ్ సైంటిస్ట్ మీట్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్లు, యంగ్ సైంటిస్ట్ లాబొరేటరీస్ డైరెక్టర్లు, హెడ్ క్వార్టర్ కార్పొరేట్ డైరెక్టర్లు, ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, అధికారులు, సివిల్ ఎంప్లాయీస్ యూనియన్, వర్క్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

పలువురు సీనియర్ సివిల్ జడ్జిలకు బదిలీ

అల్లిపురం : రాష్ట్రవ్యాప్తంగా హైకోర్టు గురువారం పలువురు సీనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో విశాఖకు చెందిన పలువురు సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ అయ్యారు. ప్రస్తుత ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీఎల్ హిమబిందు శ్రీకాకుళం ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కడప అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ బదిలీపై వస్తున్నారు. ఒకటో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సీహెచ్ యుగంధర్ శ్రీకాకుళం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి తూర్పు గోదావరి జిల్లా కాకినాడ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎంవీ పద్మజ బదిలీపై వస్తున్నారు. నాల్గో అదనపు ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ టీవీ రాజేష్‌కుమార్ విజయనగరం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా పుంగనూరు సీనియర్ సివిల్ జడ్జి కె. వాసుదేవరావు బదిలీపై వస్తున్నారు. విశాఖ ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వివేకానంద్ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా రాజాం సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కడప ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత బదిలీపై వస్తున్నారు.

బాకీ వసూలుకు యువకుడి బందీ

- బెట్టింగ్‌లతో అప్పులపాలైన రాఘవ
- అతన్ని లాడ్జిలో నిర్బంధించి, హింసించిన అప్పులిచ్చిన వారు
- వారి నుంచి విడిపించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బటన్, సర్జికల్ కత్తులు, ఈ సిగరెట్లు, ఐరన్ రాడ్డు

గోపాలపట్నం: బెట్టింగ్‌లకు అలవాటు పడి అప్పులపాలైన సనపల రాఘవను అప్పులిచ్చిన వారు నిర్బంధించి, హింసించారు. ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధి ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జిలో ఈ ఘటన జరిగింది. ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు తెలిపిన వివరాలివీ.. మాధవధార వుడా లేఅవుట్‌లో నివాసముంటున్న సనపల రాఘవ బెట్టింగ్‌లకు అలవాడు పడి అప్పులపాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడితో ఇంటి నుంచి ఎన్ఏడీ జంక్షన్‌లోని ఓ లాడ్జికి మకాం మార్చాడు. అక్కడే ఆరు నెలలు ఉన్నాడు. లాడ్జి నిర్వాహకుడు బలగ సంతోష్‌తో ఏర్పడిన పరిచయంతో అతని వద్ద రూ.5 లక్షలు అప్పు చేశాడు. లాడ్జిలో సంతోష్ ద్వారా పరిచయమైన సుజాతనగర్‌కు చెందిన ఆదర్శ్‌రెడ్డికి అప్పు అడిగాడు. అతను దున్న వివేక్ వద్ద రూ.11లక్షలు తీసుకుని రాఘవకు ఇచ్చాడు. అయితే తీసుకున్న అప్పులు తీర్చకపోవడంతో.. కొన్నాళ్లుగా వారు రాఘవపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో అతను లాడ్జి ఖాళీ చేసి వెళ్లిపోయాడు. లాడ్జి నిర్వాహకుడు సంతోష్, ఆదర్శ్‌రెడ్డి.. పిల్లా శ్రీనివాసరావు సహకారంతో రాఘవ వద్ద నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలో అతనికి ఫోన్ చేసి నాలుగు రోజుల కిందట లాడ్జికి రప్పించారు. అతన్ని నిర్బంధించి, హింసించారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు లాడ్జిలో బందీగా ఉన్న రాఘవను, నిందితులు సంతోష్, ఆదర్శ్‌రెడ్డి, శ్రీనివాసరావులను గురువారం అదుపులోకి తీసుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. నిందితుల నుంచి ఐరన్ రాడ్డు, మూడు బటన్ కత్తులు, సాధారణ కత్తి, సర్జికల్ కత్తి, రెండు ఈ సిగరెట్లు, 8 కొత్త సెల్ ఫోన్లు, నాలుగు పాత సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాఘవ ఇచ్చిన ఫిర్యాదుతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కామెడీ చిత్రం పారిజాత పర్వం



ప్రమోషన్స్‌లో పాల్గొన్న చిత్ర యూనిట్

బీచ్ రోడ్డు: క్రైమ్ కామెడీ చిత్రం పారిజాత పర్వం అని, ప్రేక్షకులకు మంచి వినోదం పంచుతుందని నిర్మాత పద్మ తెలిపారు. చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా పారిజాత పర్వం నిర్మించామని, తప్పకుండా ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో ప్రముఖ నటులు సునీల్, శ్రద్ధాదాస్, చైతన్య రావు, మాలవిక, వైవా హర్ష తదితరులు నటించారన్నారు. ఈ చిత్రాన్ని దర్శకుడు సంతోష్ కుంభంపాటి ఎంతో వినోదత్మకంగా తెరకెక్కించారన్నారు. డైరెక్టర్ మాట్లాడుతూ ఇది ఒక కిడ్నాప్ డ్రామాతో కూడిన సినిమా అన్నారు. ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుందని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.